క్లుప్తంగా

19న వాక్ ఫర్ జీసెస్



మంగళగిరి టౌన్: క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన వాక్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ కోఆర్డినేటర్ కె. రవిప్రకాష్ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని టౌన్ లూథరన్ చర్చిలో ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ 19వ తేదీ ఉదయం ఆరు గంటలకు మంగళగిరి బస్టాండ్ దగ్గరున్న అంబేద్కర్ విగ్రహం నుంచి వాక్ ఫర్ జీసెస్ ప్రేయర్ ర్యాలీ ప్రారంభమౌతుందని తెలిపారు. గౌతమ బుద్ధ రోడ్, మిద్దె సెంటర్, పాత మార్కెట్ సెంటర్, హుస్సేన్ కట్ట మీదుగా తిరిగి గౌతమ బుద్ధ రోడ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో కమిటీ కోఆర్డినేటర్లు పాస్టర్లు కె. రవికుమార్, తిమోతి, వరప్రసాద్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేష్ గ్రామంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీఐ రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. వారివద్ద నుంచి రూ. 15,090 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేడియాలజీలో ఎన్ఆర్ఐ విద్యార్థుల ప్రతిభ



మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల విద్యార్థులు రేడియాలజీలో ప్రతిభ కనపరచి బహుమతులు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం కళాశాలలో బీఎస్సీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రేడియాలజీ చదువుతున్న విద్యార్థులు తిరుపతి అపోలో వైద్యశాలలో జరిగిన ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియోగ్రాఫర్స్, టెక్నాలజీ ఆధ్వర్యంలో సిటీ సింపోజియం నిర్వహించారు. విద్యార్థులకు సీటి స్కాన్లో అధునాతన టెక్నాలజీ గురించి శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ప్రతిభను గుర్తించి విదేశీ అవకాశాలకు సహకారమందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టెక్నీషియన్ బాషా, రంగారావు, శాస్త్రవేత్తలు డేనియల్, పన్నీరు సెల్వం, శశికుమార్ పాల్గొన్నారు.

రామ మందిరంలో భారీగా అన్నదానం



తాడేపల్లి రూరల్: ఇప్పటంలోని రెడ్ల రామమందిరంలో ఆదివారం రాత్రి భారీ అన్నదానం నిర్వహించారు. నవమి వేడుకల్లో భాగంగా మందిరంలో నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈనెల 6న భక్తిశ్రద్ధలతో సీతారామ కల్యాణోత్సవాన్ని జరిపారు. ఉత్సవాలు చివరి రోజు ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు ఆరు వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

మంగళగిరి: నగర పరిధిలో ఆత్మకూరు జాతీయ రహదారి వెంట గల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈదురు గాలులతో నగర ప్రజల్లో ఆందోళన

మంగళగిరి: ఉదయం నుంచి ఎండలతో నగర ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. భారీగా ఈదురు గాలులు వీయడంతో రోడ్లన్నీ దుమ్ము లేశాయి. గాలులకు విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతో పట్టణంలో చీకటిమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు రోడ్ల వెంట వెళ్లలేకపోయారు. సుమారు గంట పాటు వీచిన గాలులతో ఇళ్ల పైకప్పులతో పాటు ఎక్కడ ఏ వస్తువు గాలిలో కొట్టుకుపోతుందోనని ప్రజలు ఆందోళన చెందారు.కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

పేదల విద్యకు కూటమి గండం

- మన బడి నాడు–నేడుతో ఊపిరి పోసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- తొలి దశ పనులు పూర్తి
- కూటమి సర్కార్ రాకతో ఆగిన మలి దశ పనులు
- చివరి దశలో అసంపూర్తిగా నిలిచిన తరగతి గదులు నిర్మాణం



ఆత్మకూరులో అసంపూర్తిగా ఉన్న పాఠశాల గదులు

మంగళగిరి: పేదలకు నాణ్యమైన ఉచిత విద్య అందించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి నాడు- నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. ఆయన పాలనలో తొలి దశ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండవ దశ పనులు జరుగుతుండగా ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటికి గ్రహణం పట్టింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పాఠశాలల్లో వివిధ దశలలో ఉన్న పనులు అంసపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో నేలమీదనే విద్యార్థులకు బోధన చేస్తున్నారు. తరగతి గదులు చాలక అవస్థలు పడుతున్నారు.

రూ. 53 కోట్లతో పాఠశాలల ఆధునికీకరణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు- నేడులో భాగంగా మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 53 కోట్లతో 68 పాఠశాలల ఆధునికీకరణ చేపట్టింది. తొలి దశలో 40 పాఠశాలల్లో పనులు పూర్తికాగా, మరో 28 పాఠశాలల్లో వివిధ దశలలో కొనసాగుతున్నాయి. దుగ్గిరాల మండలంలోని 18 పాఠశాలలకు గానూ 12 చోట్ల పనులు వైఎస్సార్ సీపీ పాలనలోనే పూర్తయ్యాయి. మరో ఆరు పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి.



కురగల్లులో బయట నేలమీద చదువుతున్న విద్యార్థులు

గాడి తప్పిన సర్కారు బడులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సర్కారు బడుల ప్రగతి గాడి తప్పింది. గతంలో కార్పొరేట్ స్కూళ్లతో పేదల బడులు పోటీ పడ్డాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటు బడులని ప్రోత్సహించి, ప్రభుత్వ బడులను నిర్లక్ష్యం చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఒక్క రూపాయి విదిల్చలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాడు- నేడు రెండవ దశ పనులు పూర్తి చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలని విద్యార్థులు, తల్లితండ్రులు కోరుతున్నారు.

> **త్వరలో ప్రారంభం**
>
> రెండవ దశ పనుల కోసం రెండు రోజుల కిందట నిధులు మంజూరు చేశారు. అధికారుల నుంచి మార్గదర్శకాలు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం.
>
> – బాబు, ఎంఈవో, మంగళగిరి

లలిత కుమారికి హిందీ సేవా పురస్కారం



లలితకుమారిని సన్మానిస్తున్న హిందీ పరిషత్ నిర్వాహకులు

మంగళగిరి టౌన్: హిందీ భాషా ప్రచారంలో గత రెండు దశాబ్దాలుగా విశేష సేవలు అందించిన వై. లలిత కుమారికి జి.వీరరాఘవాచార్యులు హిందీ సేవా పురస్కారం లభించింది. మంగళగిరి నగర పరిధిలోని సీకే జూనియర్ కళాశాలలో ఆదివారం జీవీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ మహాత్మాగాంధీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ వై. లలిత కుమారిని జీవీఆర్ హిందీ సేవా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో ప్రైవేటు హిందీ ఉపాధ్యాయులను సన్మానించారు. 8,9,10 తరగతుల్లో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ హిందీ భాషను ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సీకే విద్యా సంస్థల సెక్రటరీ గంజి చిరంజీవి, ప్రిన్సిపాల్ రత్నబాబు, జీవీఆర్ ఆచార్యులు, రంగనాధాచార్య వేదిక్ ట్రస్ట్ సెక్రటరీ మల్లికార్జునశర్మ, వెనిగళ్ల సురేష్, అంకమరావు పాల్గొన్నారు.

బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్



మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

మంగళగిరి టౌన్: బీసీల ఆశాజ్యోతి, ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ అని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్‌లో గల సంఘ రాష్ట్ర కార్యాలయంలో బీపీ మండల్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేశన శంకరరావు మాట్లాడుతూ 1979 నుంచి 1980 వరకు రెండేళ్లు అవిశ్రాంతంగా మండల్ కమిషన్ దేశంలోని వివిధ ప్రాంతాలు తిరిగి సంపూర్ణ సమాచారాన్ని సేకరించి, బీసీల సమగ్ర వికాసం కోసం 40 ప్రతిపాదనలు చేసిందని తెలిపారు. 1952లో బిహార్ అసెంబ్లీకి బీపీ మండల్ శాసనసభ్యులుగా ఎన్నికై, అధికార పక్షంలో ఉండి కూడా తన బలహీనవర్గాలకు చెందిన కుర్మీలపై అగ్రవర్ణ రాజపుత్రులు దాడులు చేయడం నిరసించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు ఉడతా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కిరణ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న స్టీవెన్

తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కార్మిక కుటుంబాల సమస్యను పరిష్కరించి వారికి బంగారు భవిష్యత్తు కల్పించాలని కోరారు. కోర్టుల తీర్పులను యాజమాన్యాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గురవయ్య, హగ్గయ్య, సుబ్బారావు, నాగేశ్వరరావు, ఇమాంబి, దుర్గాభవాని, సారమ్మ, ఆశీర్వాదం, సాంబశివరావు పాల్గొన్నారు.

మందుబాబులపై డ్రోన్ పడగ



బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న వారిని డ్రోన్ సహాయంతో గుర్తించిన పోలీసులు

మంగళగిరి టౌన్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై మంగళగిరి పట్టణ పోలీసులు డ్రోన్ సాయంతో పట్టేస్తున్నారు. పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయం, పావురాల కాలనీల్లో ఆదివారం పట్టణ పోలీసులు డ్రోన్ ఎగురవేశారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పట్టణ పోలీసులు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు డ్రోన్‌ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిని, పేకాట, కోడి పందేలు ఆడేవారిని గుర్తించి పట్టుకోవడానికి ఈ డ్రోన్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. ఇకపై ప్రతిరోజు ఇదే విధంగా డ్రోన్‌లతో గస్తీ నిర్వహిస్తామని తెలిపారు. రాత్రివేళల్లో కూడా స్పష్టంగా కనిపించే కెమెరాలు ఉన్న డ్రోన్‌ను వినియోగిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు హరిబాబు, రవీంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- మంత్రి నారా లోకేష్
- ఎన్నికల హామీల్లో భాగంగా వంద పడకల ఆసుపత్రి
- ఏడాదిలో ప్రజలకు వైద్య సేవలు
- హాజరు కాని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తున్న లోకేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

మంగళగిరి: ఎన్నికల హామీల్లో భాగంగానే నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, ఏడాదిలో పూర్తి చేసి ప్రజలకు వైద్యసేవలందిస్తామని రాష్ట్ర ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. నగర పరిధిలోని చినకాకాని జాతీయ రహదారి పక్కనున్న క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా మంగళగిరిని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. త్వరలోనే భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏడాదిన్నరలో 31 కమ్యూనిటీ హాళ్లను నిర్మించి ప్రజలకు అందిస్తామని, పార్కులు, చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పీపీపీ విధానంలో మంగళగిరి–తెనాలి రోడ్డు విస్తరణ చేపట్టామని పేర్కొన్నారు. యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు వద్ద ఏర్పాటు చేసిన ఆవరణలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

ప్లకార్డులతో మంత్రికి ఆహ్వానం

ఆసుపత్రి ఏఎన్ఎంలు, నర్సులు, సిబ్బంది ప్లకార్డులతో మంత్రిని ఆహ్వానించడం విమర్శలకు తావిచ్చింది. భారీ ఎత్తున ప్రచారంతో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హాజరుకాకపోవడంపై బీజేపీ నాయకులు అనుమానం వ్యక్తం చేశారు. మంత్రి పేరు శిలాఫలకం మీద ఉందా.. లేదా అంటూ బీజేపీ నాయకులు చూసుకోవడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎంఎడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ, సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జనసేన, టీడీపీ నాయకులు గంజి చిరంజీవి, ఆకుల జయసత్య, నందం అబద్ధయ్య, వింజమూరి ఆషా బాల, జువ్వాది కిరణ్‌చంద్, దామర్ల రాజు పాల్గొన్నారు.

మంగళగిరి ప్రజలకు కొవ్వు ఎక్కువ

చినకాకాని 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ మంగళగిరి ప్రజలకు కొవ్వు ఎక్కువ అంటూ వ్యాఖానించడంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా విస్తుపోయారు. తాను గత ఐదు సంవత్సారాలుగా ఎన్టీఆర్ వైద్య సేవల పేరుతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నానని, అప్పుడు పరీక్షలు చేసుకున్న వారిలో అధికంగా ఫ్యాట్ ఉండేదన్నారు. వారందరిని రోజు గంట నడక కొనసాగించాలని చెప్పేవాడినని తెలిపారు. ఫ్యాట్‌ను తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరు రోజూ గంట నడవాలని ఆయన సూచించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మంగళగిరి టౌన్ : మంగళగిరి నగర పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల ప్రాంతంలో దివీస్ ల్యాబొరేటరీ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి నారా లోకేష్ ఆదివారం ప్రారంభించారు. వాటర్ క్యాన్‌ను మంచినీటితో నింపి మహిళలకు అందజేశారు. నియోజకవర్గవ్యాప్తంగా రూ. 3 కోట్ల వ్యయంతో దివీస్ ల్యాబొరేటరీ ప్రతినిధులు 19 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో దివీస్ సంస్థ సీయస్ఆర్ హెడ్ జి. నగేష్, పలువురు కూటమి నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

లోకేష్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి ఆదివారం సీతానగరం ప్రజలు టీడీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఇట్టా భాస్కర్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లో మంగళగిరి నియోజకవర్గంలో పేదలకు ఉచితంగా బట్టలు పెట్టి మరి ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఘనత నారా లోకేష్‌కే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో పోతాబత్తుని శ్రీనివాసరావు, సాంబశివరావు, పుష్పాంజలి, హనుమంత్, గంగాధర్‌రావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

క్రీస్తు శ్రమలు, పునరుత్థానం నిత్య స్మరణీయం



మాని కొమ్మలతో మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య, విచారణ గురువులు



పాత మంగళగిరి లూథరన్ చర్చి ఆధ్వర్యంలో మట్టలతో చిన్నారుల ర్యాలీ

- గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య
- భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం
- చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు
- ఆకట్టుకున్న ర్యాలీలు

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ పవిత్ర వారంగా మట్టల ఆదివారాన్ని భావించాలని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో వైభవంగా మట్టల ఆదివారం పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దివ్యపూజా బలిలో చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొని వాక్యోపదేశం చేశారు. ప్రభువైన ఏసు లోతైన జీవిత పరమార్థాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. పవిత్రమైన మరియకు తనయుడిగా ఆయన జన్మించాడని తెలిపారు. పెద్ద వాడైన తరువాత ప్రజల్లో ఎన్నో అద్భుతాలు చేశాడని చెప్పారు. ప్రజలు ఏసునకు బ్రహ్మరథం పట్టారన్నారు. భూలోకానికి క్రీస్తు ఎందుకు వచ్చారో ప్రతి ఒక్కరూ గ్రహించాలని తెలిపారు. క్రీస్తు శ్రమలు, మరణం, పునరుత్థానాన్ని నిత్యం స్మరించుకోవాలని చెప్పారు. అనంతరం దివ్య పూజాబలి నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు మాని కొమ్మలు అందజేశారు. కార్యక్రమంలో బాల ఏసుదేవాలయం విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి, సహాయ విచారణ గురువులు రవీంద్ర, ప్రవీణ్‌కుమార్, మఠ కన్య స్త్రీలు, కథోళిక క్రైస్తవులు, గుడి పెద్దలు పాల్గొన్నారు.

ఈత మట్టలతో చిన్నారులు ర్యాలీలు

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గవ్యాప్తంగా క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణ, గ్రామాల్లోని వీధుల్లో ఈత మట్టలతో ర్యాలీలు నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు జయోత్సవ నినాదాలతో మంగళగిరి నగరంలోని వీధులు మారుమోగాయి. హోసన్నా జయం… రాజుల రాజుకే జయం … క్రీస్తు రాజుకే జయం అంటూ ఈతమట్టలు, ప్లకార్డులు చేతపట్టుకుని చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు మంగళగిరి నగర పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈత మట్టలకు పూలతో అలంకరించి ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి చిన్నారులు చక్కని నాటికలతో, ప్రత్యేక గీతాలతో అలరించారు. ర్యాలీలలో పలుచోట్ల యువతీ యువకులు కోలాటాలు చేశారు. పాత మంగళగిరిలోని లూథరన్ చర్చి సంఘ కాపరి రెవరెండ్ దాసిపాల్ చర్చిలో వాక్యోపదేశం అందించారు. ప్రతి ఒక్కరు ప్రేమ, ఆప్యాయతలతో జీవించాలని ఉపదేశం చారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమని, ఆయన మార్గాన్ని అనుసరించడం ద్వారా ప్రపంచశాంతి నెలకొంటుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లోని పలు చర్చిలలో పాస్టర్లు వాక్యోపదేశం అందించారు. యువతీ యువకులు, మహిళలు, స్థానిక డెలిగేట్లు, సంఘ పెద్దలు, సండే స్కూల్ పిల్లలు, సంఘస్తులు ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. తాడేపల్లి బ్రహ్మానందపురంలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దైవజనులు న్యూమెన్, జాన సుందర్, సంఘస్తులు రాజశేఖర్, ఆనంద్, భరత్, దుర్గారావు, మేరి పాల్గొన్నారు.



మంగళగిరి పార్కు రోడ్డులో ర్యాలీలో పాల్గొన్న యువతీ, యువకులు, చిన్నారులు



బ్రహ్మానందపురంలో మట్టల ఆదివారం కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

దివ్యాంగులు ఆకాశమే హద్దుగా ఎదగాలి

మేడికొండూరు: దివ్యాంగులు ఆత్మనూన్యతకు గురి కాకుండా ఆకాశమే హద్దుగా ఎదగాలని ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అన్నారు. మండల పరిధిలోని మేడికొండూరు మండల పరిషత్ కార్యాలయంలో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల సమగ్ర సమృద్ధి వికాసంపై తల్లిదండ్రులకు శిక్షణ ఇచ్చారు. ఫిరంగిపురం, మేడికొండూరు మండలాలకు చెందిన గ్రామాల నుంచి దివ్యాంగ బాలలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాల్మన్ పాల్ మాట్లాడుతూ దివ్యాంగ బాలలు ఎవరి కన్నా తక్కువ కాదని, తల్లిదండ్రులు వారిని అధిక ప్రేమతో ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలని సూచించారు. ల్యాంప్ సంస్థ కో–ఆర్డినేటర్ షేక్ బాజీ మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు, కుటుంబం సర్వతోముఖాభివృద్ధి చెందే విధంగా సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ తురకా మంగయ్య, శిక్షకురాలు సరళాదేవి, పాల్గొన్నారు.

చిన్నారి మేధావికి అంబేడ్కర్ స్మారక అవార్డు



తెనాలి: రూరల్ మండలం గుడివాడకు చెందిన చిన్నారి మేధావి బండికళ్ల ప్రదీప్‌నారాయణకు మరో గౌరవం దక్కింది. ఇండియన్ న్యూస్ మీడియా కౌన్సిల్ 2025 సంవత్సరానికి ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అవార్డును ప్రకటించింది. మూడేళ్ల వయసు కలిగిన బాలుడు ప్రదీప్‌నారాయణ అద్భుత మేధస్సుతో దేశవ్యాప్తంగా గుర్తింపును పొందాడు. వివిధ రకాల వస్తువులను 500 వరకు 15 నిమిషాల వ్యవధిలో గుర్తిస్తున్నారు. అసాధారణ జ్ఞాపకశక్తిని, గమనికా సామర్థ్యం, నేర్చుకునే ప్రతిభకు గుర్తింపుగా పలు అవార్డులను స్వీకరించాడు.

రేపు పీఎం నేషనల్ అప్రెంటిస్ మేళా

తెనాలిఅర్బన్: నేషనల్ అప్రెంటిస్ మేళాను మంగళవారం తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఐటీఐ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులందరూ పాల్గొనవచ్చునని తెలిపారు. బయోడేటా, విద్యార్హత, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 10.30 గంటలకు జరిగే మేళాలో పాల్గొనాలని అన్నారు. వివరాలకు 90144 91772, 9959828100 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.